# సారే కావాలి.. కారే రావాలి..

- బీఆర్ఎస్ విజయం కోసం సీఎం కేసీఆర్ వీరాభిమాని బైక్ యాత్ర
- వైకల్యాన్ని సైతం లెక్క చేయకుండా ఉమ్మడి 10 జిల్లాల్లో పర్యటన
- ఖమ్మంలో బీఆర్ఎస్ అభ్యర్థి అజయ్‌కుమార్‌ను కలిసిన మహేశ్



ఖమ్మంలో మంత్రి అజయ్‌కుమార్‌ను కలిసి మాట్లాడుతున్న మహేశ్

ఖమ్మం, అక్టోబర్ 30: 'సారే కావాలి.. కారే రావాలి..' అనే నినాదంతో జనచైతన్య యాత్రను చేపట్టాడు బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ వీరాభిమాని డీ.మహేశ్. బీఆర్ఎస్ విజయం కోసం అహర్నిశలూ శ్రమిస్తున్న ఈ దివ్యాంగుడు.. తన వైకల్యాన్ని సైతం లెక్కచేయకుండా రాష్ట్రంలోని ఉమ్మడి పది జిల్లాల్లోనూ బైక్‌పై పర్యటిస్తున్నాడు. మేడ్చల్ జిల్లా లింగాపుర్‌తండాకు చెందిన ఇతడు.. యాత్రలో భాగంగా సోమవారం ఖమ్మం చేరుకున్నాడు. ఇక్కడి బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు సీఎం కేసీఆరే శ్రీరామ రక్ష అని, మూడోసారి ఆయన ముఖ్యమంత్రి కావడం తథ్యమని స్పష్టం చేశారు. పార్టీ శ్రేణుల్లో జోష్ నింపేందుకే తాను ఈ యాత్ర చేపట్టానని అన్నారు. దివ్యాంగులకు ఇంత పెద్ద మొత్తంలో పింఛన్ ఇస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు. రాష్ట్రంలోని బీఆర్ఎస్ అభ్యర్థులందరినీ కలుస్తూ వారికి మద్దతు తెలుపుతూ ముందుకు సాగుతున్నట్లు చెప్పారు. ఖమ్మం జిల్లా రాజకీయాలు కూడా తనకు తెలుసునని, కేవలం పదవీకాంక్షతోనే తుమ్మల నాగేశ్వర రావు కాంగ్రెస్‌లో చేరారని అన్నారు. అందుకే సీఎం కేసీఆర్‌కు ఆయన ద్రోహం తలపెట్టారని ఆరోపించారు. ఎవరెన్ని కుట్రలు చేసినా అంతిమ విజయం బీఆర్ఎస్‌దేనని స్పష్టం చేశారు.

# కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దాడి హేయం

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: మంత్రి పువ్వాడ, ఎంపీ నామా**

ఖమ్మం, అక్టోబర్ 30: బీఆర్ఎస్ దుబ్బాక అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిపై దుండగులు దాడి చేయడం, హత్యాయత్నానికి ప్రయత్నించడం హేయమైన చర్య అని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వర రావు అన్నారు. ప్రభాకర్‌రెడ్డిపై దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు సోమవారం వారు వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి దాడులు సరికాదని అన్నారు. ఎన్నికల్లో ప్రజాస్వామ్యయుతంగా ఎదుర్కోలేకనే కొన్ని శక్తులు ఇలాంటి దాడులకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు.

# భద్రత పెంచేందుకే 'ఫ్లాగ్‌మార్చ్': ఏసీపీ



ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న ఏసీపీ, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది

రఘునాథపాలెం, అక్టోబర్ 30: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ఖమ్మం సీపీ విష్ణు ఎస్ వారియర్ ఆదేశాల మేరకు సమస్యాత్మక ప్రాంతాల్లో 'ఫ్లాగ్‌మార్చ్' నిర్వహణకు శ్రీకారం చుట్టామని ఖమ్మం ఏసీపీ హరికృష్ణ పేర్కొన్నారు. నవంబర్ 30న జరిగే ఎన్నికలకు ప్రజలు సహకరించాలని కోరారు. ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణకు అవసరమైన చర్యల్లో భాగంగా సోమవారం రఘునాథపాలెం మండలం రఘునాథపాలెం, కోయచలక, రేగులచలక గ్రామాల్లో ఫ్లాగ్‌మార్చ్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. పల్లెల్లో ప్రశాంత వాతావరణం ఏర్పాటు చేసేందుకు, ప్రజలకు భద్రత కల్పించేందుకు ఐటీబీపీ పారా మిలిటరీ సిబ్బందితో కలిసి కవాతు నిర్వహించినట్లు చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజల్లో భద్రతా భావాన్ని పెంపొందించడమే ఫ్లాగ్‌మార్చ్ ప్రధాన ఉద్దేశమని అన్నారు. రఘునాథపాలెం, ఖానాపురం హవేలీ, ఖమ్మం-2టౌన్ సీఐలు, ఎస్సై కొండలరావు, సీఆర్‌పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.





తులిశమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి పువ్వాడ, నగరంలో పలువురు ప్రముఖులను కలిసి సత్కరిస్తున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

# మున్నేరు వరదలప్పుడు.. 'తుమ్మల' ఎక్కడ?

- నేను నడుములోతు నీళ్లలో దిగి త్రీటౌన్ ప్రజలను ఒడ్డుకు చేర్చా..
- భయంతో ఆయన హైదరాబాద్‌లో ఏసీ రూంలో కూర్చున్నాడు..
- అతణ్ని గెలిపిస్తే ఉదయం హైదరాబాద్‌కు, రాత్రి సత్తుపల్లికి..
- కరోనా సమయంలో కానరాలేదు.. ఇప్పుడు కపట ప్రేమ చూపిస్తున్నాడు..
- ఖమ్మం ప్రజలు ఆలోచించాలి.. బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటేయాలి..
- ఆత్మీయ సమ్మేళనాల్లో బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్



ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం, అక్టోబర్ 30: కరోనా సమయంలో కానరాని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పుడొచ్చి ఖమ్మం ప్రజలపై కపట ప్రేమను చూపిస్తున్నారని బీఆర్ఎస్ ఖమ్మం నియోజకవర్గ అభ్యర్థి, మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ విమర్శించారు. మరి మొన్న వచ్చి మున్నేరు వరదలప్పుడు ఆయన ఏమయ్యారని, ఎక్కడున్నారని ప్రశ్నించారు. అదే వరదల సమయంలో తాను అర్ధరాత్రి వేళ నడుములోతు నీళ్లలోకి దిగి త్రీటౌన్‌లోని పరీవాహక ప్రాంత ప్రజలను ఒడ్డుకు చేర్చానని గుర్తుచేశారు. కానీ తుమ్మల ఆ సమయంలో ప్రాణభయంతో హైదరాబాద్‌లో ఏసీ రూములో కూర్చున్నారని విమర్శించారు. మళ్లీ ఆయనను గెలిపిస్తే ఉదయం హైదరాబాద్‌కు, రాత్రి సత్తుపల్లికి వెళ్లిపోతాడని విమర్శించారు. ఖమ్మం ప్రజలు ఆలోచించాలని, వారి కోసం నిలబడే మనిషికి ఆదరించాలని కోరారు. మీ ఆపదలో అండగా నిలిచిన తనకు అవకాశమివ్వాలని విజ్ఞప్తి చేశారు. ఖమ్మంలో సోమవారం విస్తృతంగా పర్యటించిన ఆయన.. 42వ డివిజన్ నిజాంపేటలో మైనార్టీ నాయకులు శంషుద్దీన్, ముజాహిద్, నయిం, షబ్బీర్ మజీద్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో, 52వ డివిజన్ మైనార్టీ నాయకుడు ఫకృద్దీన్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనాల్లో మాట్లాడారు. ఖమ్మం ప్రజల కోసమే తాను రాజకీయాల్లో ఉన్నానని, ఇతరులకు అమ్ముడుపోయే సరుకు తనకు అవసరం లేదని, నిఖార్సైన సరుకు తనకు చాలని అన్నారు. ఖమ్మం నగరాభివృద్ధి కోసం తాను పడిన కష్టం మీకు తెలుసని అన్నారు. అదే సమయంలో ప్రజలు కష్టాల్లో కాంగ్రెస్ నాయకులు ఎప్పుడూ వచ్చి పలుకరించలేదని అన్నారు. పైగా తాను చేసిన అభివృద్ధిపై విష ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనను ఖాసిం రజ్వీతో పోల్చడం విచారకరమని అన్నారు. అయినా తనకేమీ కాదని, తాను అందరి మన్ననలూ పొందిన వాడినని అన్నారు. ఖమ్మ ప్రజలు ఈ సారి కూడా తనను గెలిపిస్తే ఐదింతల అభివృద్ధి చేస్తానని అన్నారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, ఖమర్, మక్బూల్, షౌకత్ అలీ, ఇస్సాక్, మజీద్, బబ్లు, బద్రి, గురుమూర్తి, లింగరాజు, నాని, పాషా, షబ్బీర్, డాక్టర్ పువ్వాడ నరేన్, పగడాల నాగరాజు, దోరేపల్లి శ్వేత, బుర్రి వెంకట్ కుమార్, బత్తుల తిరుమల రావు, సూత్రాల శ్రీనివాస్, బుర్రి ఇందిర తదితరులు పాల్గొన్నారు.

**ప్రముఖులను కలిసిన మంత్రి పువ్వాడ..**

ఖమ్మానికి చెందిన పలువురు ప్రముఖులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సోమవారం మర్యాద పూర్వకంగా కలిశారు. రేఖల భాస్కర్, జహీర్ అలీ, మందడపు బ్రహ్మారెడ్డి తదితరులను కలిసి మద్దతు కోరారు.

**తులిశమ్మకు నివాళి..**

బీఆర్ఎస్ నాయకులు సరుపుడి సతీశ్, సరిపుడి గోపి సందేశ్‌ల నాయనమ్మ సరిపుడి తులిశమ్మ మృతి పట్ల మంత్రి అజయ్‌కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. చిరుమామిళ్ల లక్ష్మి, కొత్తపల్లి నీరజ, పైడిపల్లి రోహిణి, జాబిశెట్టి శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

# డెంగీ నియంత్రణకు పకడ్బందీ చర్యలు

**మంగళ, శుక్రవారాల్లో డ్రై డేలు పాటించాలి: కలెక్టర్ వీపీ గౌతమ్**

మామిళ్లగూడెం, అక్టోబర్ 30: డెంగీ నియంత్రణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. డెంగీ నియంత్రణపై కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో సోమవారం నిర్వహించిన సమీక్షలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకూ జిల్లాలో 24,363 నమూనాలు పరీక్షించగా.. 418 డెంగీ పాజిటివ్ కేసులు నమోదైనట్లు తెలిపారు. ప్రతి మంగళ, శుక్రవారాలు డ్రై డేలుగా పాటించాలని, ఫాగింగ్ చేయాలని, ఫీవర్ సర్వే చేపట్టాలని సూచించారు. దోమల నియంత్రణలో ప్రజలు పాలుపంచుకోవాలని కలెక్టర్ తెలిపారు. అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, డీఎంహెచ్‌వో మాలతి, జడ్పీ సీఈవో అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా ప్రధాన ఆసుపత్రి సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, మున్సిపల్ డీసీ మల్లీశ్వరి, జిల్లా ఉప వైద్య ఆరోగ్య అధికారి సైదులు, డీపీవో పుల్లారావు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వీపీ గౌతమ్

# అభివృద్ధి కోసం అజయ్‌ని గెలిపించండి

- బీఆర్ఎస్ అసెంబ్లీ ఎన్నికల జిల్లా కన్వీనర్ ఆర్‌జేసీ కృష్ణ
- ఖమ్మం నగరం 46, 47 డివిజన్లలో విస్తృత ప్రచారం



నగరంలో ప్రచారం నిర్వహిస్తున్న ఆర్‌జేసీ కృష్ణ

ఖమ్మం, అక్టోబర్ 30: ఖమ్మం నియోజకవర్గంలో మంత్రి, బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ అజయ్‌కుమార్‌ను గెలిపించాలని ఆ జిల్లా అసెంబ్లీ ఎన్నికల జిల్లా సమన్వయకర్త గుండాల కృష్ణ కోరారు. మంత్రి అజయ్‌కుమార్ విజయం కోసం నగరంలోని 46, 47 డివిజన్లలో సోమవారం ఆయన విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గడిచిన పదేళ్లలో నగరాన్ని అజయ్ అద్భుతంగా తీర్చిదిద్దారని వివరించారు. మూడోసారి కూడా గెలిపిస్తే మరింతగా అభివృద్ధి చేస్తారని అన్నారు. త్రీటౌన్ తీర్చిదిద్దిన ఘనత అజయ్‌దేనన్నారు. మాటేటి నాగేశ్వర రావు, ప్రసన్నకృష్ణ, చిన్న మల్లేశం, జానీమియా, దేవర వెంకన్న, ఉప్పలయ్య, నాగులు, టీ.భాస్కర్, రమేశ్, సత్యనారాయణ పాల్గొన్నారు.